## సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



ఇల్లంతకుంట, జూన్ 12 (మనం న్యూస్)ః ఇల్లంతకుంట మండలంలోని పలువురు లబ్ధిదారులకు వైస్ ఎంపిపి సుదగోని శ్రీనాథ్‌గౌడ్ సోమవారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వంతడుపుల గ్రామానికి చెందిన దురుముట్ల నర్సయ్యకు 18వేల రూపాయలు, రహీంఖాన్ పేట గ్రామానికి చెందిన భారతమ్మకు 18వేలు, సుధాకర్‌కు 30వేల రూపాయల విలువ చేసే చెక్కులను సర్పంచ్ లు కట్ట వెంకట్ రెడ్డి , బిలవేణి పర్శరాములుతో కలిసి అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు కట్ట వెంకట్ రెడ్డి, బిలవేణి పర్శరాములు, ఉప సర్పంచ్ బత్తిని కావ్యస్వామి, వార్డు సభ్యులు అన్నాడి నవీన్‌రెడ్డి, దురుముట్ల శ్రీనివాస్, నరేష్, బుచ్చిరెడ్డి నాయకులు రవి, నర్సయ్య, శ్రీకర్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## తాడికల్ లో మూడు కాళ్లతో వింత కోడి లభ్యం



శంకరపట్నం, జూన్ 12 (మనం న్యూస్)ః శంకరపట్నం మండలం తాడికల్ గ్రామంలో మదీనా చికెన్ సెంటర్‌లో వింత కోడి మూడు కాళ్లతో కనువిందు చేస్తుంది. తాడికల్ మదీనా చికెన్ సెంటర్ నడిపిస్తున్న మొహమ్మద్ ఇజాజ్ షాప్‌కు మూడు కాళ్ల కోడి రావడంతో ఆశ్చర్యాన్ని గురయ్యారు. ఆ వింతను చూడడానికి చాలామంది తరలివచ్చారు.

## ఘనంగా స్వయంభూ శ్రీ లక్ష్మీనరసింహస్వామి విగ్రహ ప్రతిష్టాపన



కొత్తపల్లి, జూన్ 12 (మనం న్యూస్)ః కొత్తపల్లి మండలంలోని ఆసిఫ్ నగర్‌లో స్వయంభూ శ్రీ లక్ష్మీనరసింహస్వామి మూలమూర్తి , నవగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి రోజు విశ్వక్సేణ ఆరాధన, వాసుదేవ పుణ్యాహవచనం, రక్షాబంధనం, ఋత్విక్ వరుణము మొదలగు కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా ఎంపీపీ పిల్లి శ్రీలత మహేష్ మాట్లాడుతూ నేటి నుంచి 14వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఉత్సవాలు కొనసాగనున్నట్లు, చివరి రోజైన బుధవారం ఉదయం 6 గంటలకు శ్రీ లక్ష్మీనరసింహస్వామిస్వామి ప్రాణ ప్రతిష్ట, నవగ్రహ ప్రతిష్ట కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి అన్న ప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పూజారులు సత్య వర్ధన్, భాను వర్ధన్, సంతోష్, అనిల్ భక్తులు పాల్గొన్నారు.

# మురుగునీటి బారి నుంచి రక్షించండి

## కలెక్టర్‌కుబావుపేట వాసుల మొర

కరీంనగర్ కలెక్టరేట్, జూన్ 12 (మనం న్యూస్)ః నాలుగు వరసల రహదారి విస్తరణలో భాగంగా చేపట్టిన డ్రైనేజీ నిర్మాణం అస్తవ్యస్తంగా మారి ఆవాసాల మధ్యకు చేరుతున్న మురుగునీరు, దాని నుంచి వెలువడుతున్న దుర్గంధం నుంచి తమను రక్షించాలని కోరుతూ కరీంనగర్ జిల్లా కొత్తపల్లి మండలం ఆసిఫ్‌నగర్, బావుపేట గ్రామస్థులు కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా కలెక్టర్‌ను కలిసిన గ్రామస్తులు తమ గోడును వెల్లబోసుకుని సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ బావుపేట గ్రామం వద్ద నిర్మించిన నాలుగు లైన్ల రహదారి విస్తరణలో భాగంగా ఇరువైపులా డ్రైనేజీలు నిర్మించినప్పటికీ అందులో నీరు రోడ్డు వెంట ప్రవహిస్తున్నాయని తెలిపారు. దీని వల్ల ఈ ప్రాంతంలోని దాదాపు 150 ఇండ్ల సమీపంలోకి మురుగు నీరు చేరి తీవ్ర దుర్గంధంతో పాటు పందులు, క్రిమి కీటకాలు చేరి ప్రజలు





అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మురుగునీటి కారణంగా రోడ్డుపై భారీ గుంత ఏర్పడి ప్రమాదాలకు కారణమవుతోందన్నారు. గత రెండేళ్లుగా మురుగునీటి కారణంగా తాము అనేక సమస్యలు ఎదుర్కొంటున్నప్పటికీ గ్రామపంచాయితీ పట్టించుకోవడం లేదని, అది ఆర్ అండ్ బి శాఖ పరిధిలోకి వస్తోందని తెలిపి చేతులు దులుపుకున్నారని వాపోయారు. ఈ విషయమై గత నెల 29న ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా, పరిశీలించి సమస్యను పరిష్కరించాలని డిపిఓను కలెక్టర్ ఆదేశించినప్పటికీ ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. దాదాపు 15 రోజులు గడిచినా జిల్లా పంచాయతీ అధికారి నుంచి గానీ, సంబంధిత అధికారుల నుంచి గానీ ఎటువంటి స్పందన లేదన్నారు. డ్రేనేజీ నుంచి బయటకు వస్తోన్న మురుగునీటిని సమీపంలో తూంకుంటలోకి వెళ్లే విధంగా చర్యలు చేపట్టాలని వారు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బావుపేట గ్రామస్థులు కరుణాకర్, నవీన్, గంగవ్వ, రమేష్, కనకయ్య, సదయ్య, చంద్రమౌళి, రమేష్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## గౌడ కులస్తులకు సబ్సిడీ రుణాలివ్వాలి

### గౌడ సంఘం మండలాధ్యక్షులు తిరుపతి గౌడ్

చిగురుమామిడి, జూన్ 12 (మనం న్యూస్)ః బిసి సామాజిక వర్గానికి చెందిన కులాల వృత్తుల రక్షణకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సబ్సిడీతో లక్ష రూపాయల రుణం ఇవ్వడం సంతోషమే కానీ గౌడ సామాజిక వర్గాన్ని అందులో చేర్చకపోవడం బాధాకరమని గౌడ సంఘం మండల అధ్యక్షుడు తాళ్లపల్లి తిరుపతి గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గౌడ కులాన్ని కూడా లక్ష రూపాయల రుణ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. నిత్యం ప్రమాదంతో కూడిన కల్లు గీత వృత్తిని కొనసాగిస్తూ వారి కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. వృత్తిలో భాగంగా చనిపోయిన కుటుంబాల ఆర్థిక పరిస్థితి చాలా దీనంగా ఉందని తెలిపారు. బీసీ సామాజిక వర్గంలో ఉన్న గౌడ కులస్తులకు ఇప్పటివరకు ఎలాంటి రుణ సదుపాయం లేదని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి బీసీలకు ఇచ్చే లక్ష రూపాయల సబ్సిడీ రుణాన్ని మిగతా



వర్గాల తో పాటు గౌడ సామాజిక వర్గానికి ఇవ్వడంతో పాటు ఆర్థికంగా ఎదగడానికి గౌడ కార్పొరేషన్ ద్వారా రుణ సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో గౌడ సంఘం మండల ఉపాధ్యక్షుడు బుర్ర తిరుపతి గౌడ్ సంఘం మండల నాయకులు బూరుగు రాజయ్య గౌడ్ ఏడుకొండ రమేష్ గౌడ్ గోపగోని తిరుపతి గౌడ్ దేశిని రాజయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బండి సంజయ్‌పై రవీందర్ సింగ్ వ్యాఖ్యలు అర్థరహితం

### దమ్ముంటే రాష్ట్ర ప్రభుత్వ గ్రాంట్ పై శ్వేతపత్రం విడుదల చేయాలి

### స్మార్ట్ సిటీ పనులపై రాష్ట్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు

### బిజెపి పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ ప్రవీణ్ రావు

కరీంనగర్, జూన్ 12 (మనం న్యూస్)ః కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు, స్మార్ట్ సిటీ అడ్వైజరీ కమిటీ చైర్మన్ బండి సంజయ్ కుమార్ పై సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్ సింగ్ చేసిన వ్యాఖ్యలు అర్థరహితమని బిజెపి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్ రావు ఓ ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం కరీంనగర్ అభివృద్ధికి కట్టుబడే, కరీంనగర్ కు స్మార్ట్ సిటీ హోదా కల్పించిందని పేర్కొన్నారు. సంజయ్ కుమార్ కృషితో స్మార్ట్ సిటీ కింద నగరంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం వందల కోట్ల నిధులను మంజూరు చేసిందని, రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య కారణంగానే స్మార్ట్ సిటీ పనులు మందకొడిగా కొనసాగుతున్నాయని విమర్శించారు. సివిల్ సప్లై చైర్మన్ రవీందర్ సింగ్ కు దమ్ముంటే స్మార్ట్ సిటీ రాష్ట్ర ప్రభుత్వ మ్యాచింగ్ గ్రాంట్ పై శ్వేత పత్రం విడుదల చేయించాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ సిటీ పనులపై ఎప్పటికప్పుడు ఎంపీ బండి సంజయ్ కుమార్ రివ్యూ చేస్తున్నారని, పలు సందర్భాల్లో నగరంలో పర్యటించి అధికారులకు తగిన సూచనలు చేశారనే విషయం రవీందర్ సింగ్ గుర్తుపెట్టుకుని మాట్లాడితే మంచిదని ప్రవీణ్‌రావు సూచించారు. ఓట్ల కోసం



జిమ్మిక్కులు చేసేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనని, కాంట్రాక్టర్లతో కుమ్మక్కై కమిషన్ల కోసం కక్కుర్తి పడుతూ స్మార్ట్ సిటీ పనులను నాణ్యత లేకుండా చేపడుతుంది ఎవరో ప్రజలకు తెలుసని పేర్కొన్నారు. రవీందర్ సింగ్ అవగాహనతో మాట్లాడితే మంచిదని, అనవసర వ్యాఖ్యలు చేస్తే బిజెపి చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. సివిల్ సప్లై బాధ్యతలు నిర్వహిస్తున్న రవీందర్ సింగ్ ఇటీవల అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందించే విషయం పై, రైతుల పంట కొనుగోళ్ల పై దృష్టి సారించాలని సూచించారు. కొనుగోలు చేసిన పంటకు రైతులకు నేటికి డబ్బులు ఇవ్వకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని , వెంటనే రవీందర్ సింగ్ ఆ విషయాలపై దృష్టి పెడితే మంచిదని ఆయన ఈ సందర్భంగా హితవు పలికారు.

